క్లుప్తంగా

ఘనంగా శివకోటి నామార్చన



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

పాకాల: మండలంలోని మొగరాల భారతం మిట్ట వాసులు బుధవారం శివకోటి నామార్చనను ఘనంగా నిర్వహించారు. పురోహితులు విశేష పూజలు చేసి భక్తులతో శివకోటి నామాలు ఉచ్చరింపజేశారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతి అర్బన్, రూరల్ పోలీసుస్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో డబ్బుపెట్టి పేకాట ఆడడం తదితర నేరాలకు పాల్పడిన పలువురికి 52 కేసుల్లో రూ.44,480 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు బుధవారం తీర్పు చెప్పారు. నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



తిరుపతి మంగళం: మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీలో పెళ్లి నిశ్చయమైన గుణశేఖర్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి అందజేశారు. అలాగే శివశంకర్‌రాజు తన సొంత డబ్బు రూ.5116 అందజేశారు. వార్డు మెంబర్లు భారతి, బుజ్జి, ఈశ్వరమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో వీధి విక్రయదారుల జిల్లా మహాసభలు

తిరుపతి కల్చరల్: గూడూరు పట్టణంలో మార్చి 3, 4వ తేదీల్లో ఏపీ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ తిరుపతి జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.శివ తెలిపారు. వారు బుధవారం శ్రీనివాస కల్యాణ మండపం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు.

కుతూహలమ్మ మృతి తీరని లోటు

భాకరాపేట: మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ మృతి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవ రెడ్డి, చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపారు. మంత్రిగా, ఉప సభాపతిగా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలిగా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆమె సేవలను కొనియాడారు.

కళాశాలకు డెస్కులు అందజేత



కళాశాలకు వచ్చిన డెస్కులు

ఎర్రావారిపాళెం: మండలంలోని నెరబైలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు యాక్ట్ ఎన్‌జీవో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దశరథరెడ్డి బుధవారం 55 డెస్కులు వితరణ చేశారు. దాతకు ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్



సాంకేతిక సమ్మేళనంలో పాల్గొన్న కామసాని దాము, తదితరులు

తిరుపతి మంగళం: విద్యార్థి దశనుంచే నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ వుంటుందని రాపిడ్ క్లౌడ్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ సీఈవో కామసాని దాము తెలిపారు. తిరుపతి- కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయస్థాయి యాజమాన్య, సాంకేతిక సమ్మేళనం (ఎంప్లస్ -2023) నిర్వహించారు. కామసాని దాము మాట్లాడుతూ విద్యార్థులు మేనేజ్‌మెంట్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుని రాణించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీజ మహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో జయ తీర్థాచారి, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అనంతపురమ్మ విగ్రహ ప్రతిష్ట



ఎర్రావారిపాళెం: మండలంలోని ఎల్లమంద గ్రామంలో నిర్మించిన ఆలయంలో గ్రామ దేవత అనంతపురమ్మ విగ్రహ ప్రతిష్టను గురువారం చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తెల్లవారుజాము 3 గంటల నుంచి 4 మధ్య విగ్రహ ప్రతిష్ఠి ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గరుడ వాహన గోవిందా..



గరుడ వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణమ్మ, పోకల అశోక్‌కుమార్, టీటీడీ జేఈవో



ట్రస్టు సభ్యులతో కలిసి గొడుగులు అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

- మోహినీ అవతారంలో శ్రీనివాసుడి విహారం
- కిక్కిరిసిన నాలుగు మాడవీధులు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామి వారు పల్లకిపై మోహినీగా, రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అక్కడ విశేషంగా అలంకరించి పల్లకిపై అధిష్ఠింపజేశారు. లోక కల్యాణకారకుడైన కల్యాణ వెంకటేశ్వర స్వామి దివ్య మోహిని రూపంలో ఉత్సవ మూర్తియై, తిరుచ్చిపై చిన్ని కష్ణుడిగా భక్తులను అనుగ్రహించారు.

గరుడ వాహనంపై గోవిందుడి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనోత్సవం అత్యంత ముఖ్యమైనది. బుధవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారు గరుత్మంతుడిపై ఊరేగుతూ భక్తులకు దివ్యాశీస్సులు అందించారు. భక్తుల కోలాటాలు, చెక్కభజనలు, కేరళ వాయిద్యాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు నాలుగు మాడవీధుల్లో విహరించారు. గోవింద నామస్మరణలో శ్రీనివాసమంగాపురం మారుమోగింది. గరుడ వాహనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చంద్రగిరి పోలీసులు, విజిలెన్స్ అధికారులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, సీఐ ఓబులేశు, ఎస్ఐ సంజీవకుమార్, రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ రమణయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరుచ్చిపై చిన్ని కృష్ణుడు, మోహినీగా ఊరేగుతున్న శ్రీనివాసుడు

నేడు స్వర్ణ రథోత్సవం

కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనం, మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు వసంతోత్సవం, 5 నుంచి 6 గంటల వరకు స్వర్ణ రథోత్సవం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు గజ వాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు.

శ్రీవారికి గొడుగుల సమర్పణ

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహనానికి తమిళనాడు రాష్ట్రం తిరునింద్రకు చెందిన శ్రీమత్ రామానుజ కైంకర్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు గొడుగులు సమర్పించారు. గొడుగులను ముందుగా తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి శ్రీనివాసమంగాపురానికి తరలించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి చేతుల మీదుగా ఆలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రామ్మోహన్ నాయుడు, నందకుమార్, వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్ రెడ్డి ఉన్నారు.

రామలింగ చాముండేశ్వరికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తిరుపతి రూరల్: మండలంలోని పుదిపట్ల గ్రామంలో నిర్మించిన రామలింగ చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి, కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. వారికి ఆలయ కమిటీ పెద్దలు సాదరంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలల ఊరేగింపు



తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయం నుంచి అంబారిపై బయలుదేరిన పూలమాలలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు స్వామి వారు గరుడ వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయం తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలోని ఆండాళ్(గోదాదేవి) అమ్మవారి ఆలయం నుంచి స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేయించిన పూలమాలలను సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన గోదాదేవి యాత్ర ఎస్వీ గో సంరక్షణశాల, తాటితోపు, పెరుమాళ్లపల్లి మీదుగా శ్రీనివాసమంగాపురానికి 11.30 గంటలకు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి వైఖానస ఆగమోక్తంగా మాలలను స్వామి వారి మూలవిరాట్‌కు అలంకరించారు. రాత్రి జరిగిన గరుడ సేవలో శ్రీవారికి ఈ మాలలను అలంకరించడంతో స్వామి వారు శోభాయమానంగా వెలిగిపోతూ భక్తులకు అభయమిచ్చారు.

అధికార నందిపై కపిలేశ్వరుడి విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారు



అధికార నంది వాహనంపై ఊరేగుతున్న కపిలేశ్వర స్వామి

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సర్వాంగ సుందర అలంకార ప్రియుడైన సోమస్కందమూర్తి అధికార నంది వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం కామాక్షి సమేత సోమస్కందమూర్తి తిరుచ్చిపై ఊరేగారు. అనంతరం స్వామి వారికి స్నపన తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద బుధవారం ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం పాఠశాల, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వైఎస్సార్ సీపీ నేత మృతికి నివాళి



ఉమాకాంత్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: మండలంలోని పెదబైనపల్లి పంచాయతీ దాసర్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కత్తి ఉమాకాంత్‌రెడ్డి(41) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ఉమాకాంత్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, నాయకులు నంగాబాబురెడ్డి, హరికృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, రమేష్, మునిరత్నం రెడ్డి, భరత్ మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

తలకోనలో వైభవంగా బ్రహ్మోత్సవాలుప్రారంభం

ఎర్రావారిపాళెం: తలకోన సిద్ధేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు గోపూజ, మహాగణపతి పూజ చేశారు. పుణ్యాహవచనం, కలశస్థాపన చేశారు. రుద్ర పారాయణం అనంతరం సాయంత్రం నందీశ్వరుడికి అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించారు. తర్వాత ధ్వజారోహణం చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. కోడూరుకు చెందిన దాత శివకుమార్ బుధవారం భక్తుల సౌకర్యార్థం తలకోన సిద్ధేశ్వస్వామి అన్నదాన సత్రంలో రూ.లక్షలతో ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు.



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

అనధికార యాప్‌లు వాడొద్దు



మాట్లాడుతున్న ఏఎస్పీ విమలకుమారి

చంద్రగిరి: అనధికార యాప్‌లను వాడి మోసపోవద్దని తిరుపతి ఏఎస్పీ(క్రైం) విమల కుమారి తెలిపారు. ఏ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో బుధవారం సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సైబర్ క్రైం బారిన పడిన వారు వెంటనే 1930కు కాల్ చేయవచ్చని, లేదా httpr://cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అదే విధంగా తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉన్న సైబర్ క్రైం ల్యాబ్ పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వీసీ నాగరాజు, సైబర్ క్రైం నిపుణులు నరసింహారావు, డీఎస్పీ నరసప్ప, సైబర్ క్రైం సీఐ రామచంద్రారెడ్డి, ఎస్ఐ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ విజేత సీఈ నాగేశ్వరరావు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సీనియర్ అధికారుల షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు విజేతగా నిలిచారు. ప్రిన్సిపాల్ బి.సురేంద్ర రన్నరప్‌గా నిలిచారు. సీనియర్ అధికారుల షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో డెప్యూటీ ఈవో గోవిందరాజన్, డీఈవో భాస్కర్ రెడ్డి విజయం సాధించగా, ఈఈలు శివ రామకృష్ణ, మల్లికార్జున ప్రసాద్ రన్నర్స్‌గా నిలిచారు. సీనియర్ మహిళా అధికారుల టెన్నికాయిట్ పోటీల్లో డాక్టర్ రేణుదీక్షిత్, డాక్టర్ కుసుమ కుమారి విజయం సాధించగా, డెప్యూటీ ఈవో స్నేహలత, ప్రిన్సిపాల్ నారాయణమ్మ రన్నర్స్‌గా నిలిచారు.

టీటీడీ ఉద్యోగులకు అవగాహన సదస్సు

తిరుపతి అలిపిరి: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఆర్బీఐ అధికారులు బుధవారం శ్వేతా భనంలో టీటీడీ ఉద్యోగులకు ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌బీఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ పూర్ణిమ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ మార్గదర్శకాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సిస్టంలోని సైబర్ సేఫ్టీ పద్ధతులు తదితరాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక సంక్షోభ సమయంలో ఆర్థిక క్రమశిక్షణ సహాయం చేస్తుందని చెప్పారు. తిరుపతి ఆర్బీఐ హెడ్ సుభాష్ మాట్లాడుతూ ఆర్థిక, సైబర్ నేరాల గురించి వివరించారు. ఆర్‌బీఐ అధికారి ఎల్ఎం నాయుడు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. శ్వేతా డైరెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

ల్యాబ్ అందుబాటులో లేకపోతే ఎలా ?

- తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి నిర్వహణపై జీపీఎంసీ సభ్యుల ఆగ్రహం

తిరుపతి తుడా: ఇంతపెద్ద ఆస్పత్రిలో ల్యాబ్ పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులో లేకపోవడం ఏంటని జీపీఎంసీ సభ్యుడు కేవీ శేఖర్‌రాజు నిలదీశారు. తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిని జీపీఎంసీ (జనరల్ పర్పస్ మెడికల్ కేర్) సబ్ కమిటీ సభ్యులు కేవీ శేఖర్‌రాజు, సౌత్‌జోన్ మెడికల్ కమిషనర్ డాక్టర్ సునీతాచోప్రా, ఈఎస్ఐ ప్రాంతీయ బోర్డు సభ్యులు ఎస్.మోహన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల సహాయకుల నుంచి వారికి ఎక్కువ ఫిర్యాదులు అందాయి. దీంతో తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి నిర్వహణా లోపంతో పాటు, ల్యాబ్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, మందుల కొరత, ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై జీపీఎంసీ సబ్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆస్పత్రిలో నీటికొరత, మరుగుదొడ్ల కొరత, రోగుల సహాయకులను తీవ్రంగా వేధిస్తుండడంపై డాక్టర్ సునీతచోప్రా కన్నెర్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఏటా వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. కానీ ఆ స్థాయిలో వైద్య సదుపాయాలు అందించకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఇక్కడి లోపాలను గుర్తించి ఢిల్లీలోని సంబంధిత శాఖకు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ల్యాబ్ నిర్వహణ, మందుల కొరతకు గల కారణాలను సబ్ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.రాధాకృష్ణ, కె.రజనీకాంత్, రాష్ట్ర బీమా వైద్యశాఖ జోన్ జాయింట్ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న జీపీఎంసీ సబ్ కమిటీ అధికారులు

జీతం ఇప్పించి ఆదుకోండి

తిరుపతి కల్చరల్: గత ఆగస్టు నుంచి జీతం రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, సంబంధిత అధికారులు స్పందించి జీతం ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన గురుకుల పాఠశాల వాచ్‌మెన్ వి.వెంకటముని విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాను ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పీలేరులోని గిరిజన గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్‌గా పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నానని తెలిపారు. జిల్లాల విభజన నేపథ్యంలో పీలేరు అన్నమయ్య జిల్లా పరిధిలోకి వెళ్లడంతో వేతనం ఆలస్యమైందన్నారు. సంబంధిత అధికారులను కలిసి విజ్ఞప్తి చేస్తే జిల్లాల విభజన నేపథ్యంలో ఇంకా మ్యాపింగ్ కాలేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ఏడు నెలలుగా జీతం లేకపోవడంతో కుటుంబ జీవనం కష్టంగా మారిందని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి వేతనం త్వరగా ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.



మాట్లాడుతున్న వెంకటముని

గుర్తుతెలియని యాచకురాలి మృతి



తిరుపతి క్రైం: నగరంలోని వెస్ట్ చర్చి సమీపంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని యాచకురాలు మృతి చెందినట్టు ఎస్వీయూ సీఐ రవీంద్రనాథ్ తెలిపారు. ఆమెకు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, ఆమె కొంతకాలంగా వెస్ట్ చర్చి సమీపంలో భిక్షమెత్తుకుని జీవనం సాగిస్తోందని తెలిపారు. పూటుగా మద్యం సేవించి చర్చి సమీపంలో కిందపడిందని, తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించామన్నారు. ఆమె ఆచూకీ తెలిస్తే 9491074524లో సంప్రదించాలన్నారు.

అమ్మవారికి కానుకగా బంగారు డాలర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి నాయుడుపేటకు చెందిన సుబ్రమణ్యం 50 గ్రాముల బంగారు డాలర్ బహూకరించాడు. ఈ మేరకు ఆయన బుధవారం డాలర్‌ను ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథంకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ మధు, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.



అవయవ దానంతో పునర్జన్మ



మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

తిరుపతి తుడా: అవయవాల దానంతో మరికొందరికి పునర్జన్మను అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్ అయిన వారి గుండె, కిడ్నీ, లివర్, కళ్లు, లంగ్స్ తదితర అవయవాలను దానం చేయవచ్చన్నారు. వాటిని మరొకరికి అమర్చడం ద్వారా పునర్జన్మ ఇవ్వవచ్చని పేర్కొన్నారు. అవయవదానం చేయాలనుకునే వారు జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయవచ్చన్నారు. లేదా 9133852000ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. వైజాగ్‌లో ఇటీవల మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానపం చేశారని తెలిపారు. ఆమె గుండెను తిరుపతిలోని 16 ఏళ్ల బాలుడికి విజయవంతంగా అమర్చినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, ఎస్వీ మెడికల్ కళాశాల జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగమునీంద్రుడు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

తిరుపతి కల్చరల్: గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు బుధవారం గిరిజన భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన సంఘం నేత గుండాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి లేబర్ కమిషనర్ బాలు నాయక్, కార్పొరేటర్ హనుమంతనాయక్, గిరిజన సంఘం నేతలు వెంకటరమణ నాయక్, శివనాయక్, ప్రభాకర్ నాయక్ పాల్గొని సేవాలాల్ మహరాజ్ సందేశాన్ని వివరించారు. గిరిజనులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పథకాలను, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నేతలు ప్రసాద్ నాయక్, కిశోర్ నాయక్, హరినాయక్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న గిరిజన నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి అర్బన్: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయ అధికారులు బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్వోలతో సమీక్షించారు. ఎన్నికలు పటిష్ఠంగా నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలోని పరిస్థితులను తెలుసుకున్నారు. డీఆర్వో శ్రీనివాసరావు జిల్లా పరిస్థితులను వివరించారు. రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఆర్.చంద్రమౌళి, ఆర్డీవోలు రామారావు, కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, భాస్కర నాయుడు, తహసీల్దార్లు కుప్పయ్య, పరమేశ్వర స్వామి పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్: రెండు వేర్వేరు చోరీ కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. 2016 సెప్టెంబర్ 26వ తేదీ తిరుమల బాలాజీ బస్టాండు వద్ద హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలి హ్యాండ్ బ్యాగ్ చోరీకి గురైంది. అందులో రూ.70 వేలు విలువైన 35 గ్రాముల బంగారు నగలున్నాయి. అలాగే 2016 అక్టోబర్ 5న తిరుమల సీఆర్వో కార్యాలయం ఉచిత బస్టాప్ వద్ద నెల్లూరుకు చెందిన ఓ యువతి హ్యాండ్ బ్యాగ్ చోరీకి గురైంది. అందులో 16 గ్రాముల బంగారు నగలున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుమల సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి తమిళనాడు వేలూరు జిల్లా తిరువత్తూరు గాంధీనగర్‌కు చెందిన ఎం.చంద్రశేఖర్, చంద్రశేఖర్, లక్ష్మిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరికి ఒక నెల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మరో కేసులో :

2017 జనవరి 8న తిరుమల బాలాజీ ఆర్టీసీ బస్టాండు వద్ద గుంటూరుకు చెందిన మహిళ హ్యాండ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 24 గ్రాముల బంగారు నగలను చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి కృష్ణా జిల్లా విజయవాడ కొత్తపేటకు చెందిన ఐ.దుర్గారావును కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు దుర్గారావుకు 49 రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.